ప్రభుత్వ దవాఖానకు పరికరాలు అందజేయడం అభినందనీయం

మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ ప్రభుత్వ ఏరియా దవాఖానలో ఆక్సినేటర్, సెల్ కౌంటర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, జూన్ 20 : విదేశాల్లో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తూ, తన పుట్టిన ఊరుపై ఉన్న ప్రేమ స్వదేశానికి తీసుకువచ్చిందని, దీంట్లో భాగంగానే బాన్సువాడ దవాఖానకు వైద్య పరికరాలు అందజేసినందుకు జనహిత ఫౌండేషన్ ప్రతినిధులను మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా సోమేశ్వర్ గ్రామానికి చెందిన బోడ రఘుపతిరెడ్డి కుమారుడు డాక్టర్ అశ్విన్‌రెడ్డి, కుమార్తె డాక్టర్ హిమబిందు సౌజన్యంతో బాన్సువాడ మాతా శిశు దవాఖానకు ఆక్సినేటర్, సెల్ కౌంటర్‌ను సుమారు రూ.3 లక్షల విలువైన వైద్య పరికరాలను ఎమ్మెల్యే పోచారం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. విదేశాల నుంచి వచ్చి బాన్సువాడ ప్రాంత ప్రజలకు అందే వైద్యంలో తనవంతు పాత్ర ఉండాలని ఆకాంక్షించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం జనహిత ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ అశ్విన్‌రెడ్డి, డాక్టర్ హిమబిందు, డాక్టర్ రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు ఎజాస్, సంగ్రాంనాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, ఉదయ్‌గుప్తా, పర్వారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు నర్సింహులు, రవీందర్ గుప్తా, ఎంపీపీ రఘు , శ్రావన్ కుమార్, శ్రీనివాస్, శశికాంత్, ఆరీఫ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బాన్సువాడ టౌన్, జూన్ 20 : బాన్సువాడలోని పోలీస్ లైన్‌లో ఉన్న బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి గురువారం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. బాన్సువాడలోని మాతా-శిశు దవాఖానను ఎమ్మెల్యే పోచారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. దవాఖానలో సేవలు అందిస్తున్న ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాల విద్యార్థినులతో పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులతో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

లింగంపేటలో మాత్రల పంపిణీని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి

మద్నూర్‌లో మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

మత్తమాల పీహెచ్‌సీలో..

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూన్ 20: నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా గురువారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీల్లోని చిన్నారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. 19ఏండ్లలోపు వారందరూ మాత్రలను తప్పకుండా వేసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. మాత్రలను వేసుకుంటే ఆరోగ్యంగా ఉండడంతో పాటు నులి పురుగులను నివారించవచ్చని తెలిపారు. బాన్సువాడలోని ప్రభుత్వ మాతా-శిశు దవాఖానలో మాత్రలను మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధు లు, దవాఖాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నిజాంసాగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీష నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. లింగంపేట మండలంలో మొత్తం 10,232 మందికి నట్టల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి హిమబిందు తెలిపారు. లింగంపేటలో చేపడుతున్న కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి తనిఖీ చేశారు. నాగిరెడ్డిపేట మండలంలో 19ఏండ్లలోపు వారు 6,647 మంది ఉండగా.. వారిలో 5,916 మందికి మాత్రలు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యుడు సృజన్‌కుమార్ తెలిపారు. ఎల్లారెడ్డి మండలంలో మొత్తం 10,600 మందికి మాత్రలు వేయడం లక్ష్యం కాగా 10,192మందికి వేశామని మత్తమాల పీహెచ్‌సీ వైద్యుడు శరత్‌కుమార్ చెప్పారు. కార్యక్రమాల్లో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగంపేట కస్తూర్బా విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న ఎంపీపీ వినీత, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

జిల్లా వ్యాప్తంగా 2,30,004 మందికి నులిపురుగుల మాత్రలు అందజేత

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు 2,50,254 మంది ఉన్నారు. అందులో బాలురు 1,28,361, బాలికలు 1,21,893 మంది ఉండగా గురువారం 2,30,004 మందికి నులి పురుగుల మాత్రలు వేసినట్లు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 91.9 శాతం నమోదయిందని తెలిపారు.

కొయ్యగుట్ట తండాలో..

బీర్కూర్‌లో..

పోసానిపేట్‌లో..

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి

కామారెడ్డి, జూన్ 20 : ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటిస్తే రోగాల బారి నుంచి రక్షించుకోవచ్చని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. 14వ జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ముదాంపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఫిబ్రవరి, జూన్ నెలల్లో రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తున్నదని చెప్పారు. ఈ మాత్రలు వేసుకోవడంతో కడుపులో నట్టలు నశిస్తాయన్నారు. అనీమియాను నియంత్రించవచ్చని తెలిపారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో ఏ ఒక్కరిని విడిచిపెట్టకుండా మాత్రలు వేయాలని అన్నారు. వంద శాతం లక్ష్యం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ వనిత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చంద్రశేఖర్, డీఈవో రాజు, ఎంఈవో ఎల్లయ్య, ప్రధానోపాధ్యాయుడు రమణారెడ్డి, కౌన్సిలరులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

అభివృద్ధి పనుల పరిశీలన

బీబీపేట్, జూన్ 20 : మండల కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. గ్రామ పంచాయతీ నర్సరీ, వైకుఠధామం, పల్లెప్రకృతి వనం, ఆదర్శ పాఠశాలల్లో భాగంగా స్కూల్‌లో మరమ్మతులు చేసిన మరమ్మతు పనులు, యూనిఫామ్స్, ఉప్పర్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. బీబీపేట్‌లోని పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వైద్య సిబ్బంది విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో డీఈఈ అర్చన, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీవో కృష్ణ. మండల వైద్యాధికారిణి భానుప్రియ, వైద్య, ఆరోగ్య, ఐకేపీ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో ప్రజల పాత్ర కీలకం

బాన్సువాడ రూరల్, జూన్ 20 : గ్రామాభివృద్ధిలో గ్రామస్తుల పాత్ర కీలకమని, గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రణాళికలతో ముందుకు సాగాలని పద్మపాని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అన్నారు. మండలంలోని బోర్లం క్యాంపులో గ్రామస్తులతో కలిసి విలేజ్ డెవలప్‌మెంట్ ఫోరం కమిటీని గ్రామస్తుల సమక్షంలో గురువారం ఎన్నుకున్నారు. గ్రామంలో విద్యా, వైద్యం, సాగునీరు, తాగునీరు, సేంద్రియసాగు తదితర అంశాలపై గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు, కారోబార్ వినయ్‌కుమార్, గ్రామపెద్దలు పీర్యానాయక్, సంగ్యానాయక్, శ్రీనివాస్, అంబు, ప్రవీణ్‌కుమార్, అంబర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

కలెక్టర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

కామారెడ్డి, జూన్ 20 : కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నియమితులైన అశీష్ సంగ్వాన్‌ను టీఎన్జీవోస్ నాయకులు కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకె, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సాయిలు, కేంద్ర సంఘం కార్యదర్శి నాగరాజు, సహాధ్యక్షుడు చక్రధర్, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, జాయింట్ సెక్రటరీలు గణేశ్, రాజ్యలక్ష్మి, నవిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి, జూన్ 20 : పట్టణంలోని గొల్లవాడకు చెందిన పొన్నాల లక్ష్మి అదృశ్యమైందని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం కామారెడ్డి బస్టాండ్ నుంచి తన ముగ్గురు పిల్లలతో కలిసి భర్త స్వామికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిందన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

రైతులకు సాగునీరు అందించాలి

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

అధికారులతో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి, జూన్ 20: నియోజక వర్గ రైతుల పొలాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అధికారులకు సూచించారు. ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. వానకాలం ఆరంభమైందున రైతులు పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా చర్యలు చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ రాజ్ రోడ్లకు సంబంధించిన వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిధులు మంజూరైన రోడ్లకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ట్రాన్స్‌కో, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో మాట్లాడి ఆయా శాఖల వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

రోగులను పరీక్షిస్తున్న ఆప్తాలమిస్ట్ హరికిషన్‌రావు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 20: ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ దవాఖానలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బాన్సువాడ లయన్స్ కంటి దవాఖాన ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో మొత్తం 92మందికి నేత్ర పరీక్షలను నిర్వహించినట్లు ఆప్తాలమిస్ట్ హరికిషన్‌రావు తెలిపారు. 14మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించి వారిని ఆపరేషన్ నిమిత్తం బాన్సువాడ లయన్స్ కంటి దవాఖానకు రిఫర్ చేసినట్లు చెప్పారు. 31మందికి దృష్టిలోపం ఉన్నవారికి కంటి అద్దాలను రాసి ఇచ్చినట్లు వివరించారు. తీవ్ర దృష్టిలోపం ఉన్న ముగ్గురిని హైదరాబాద్‌లోని సరోజినీదేవి కంటి దవాఖానకు పంపించినట్లు తెలిపారు. పలు రకాల నేత్ర జబ్బులపై ప్రజలకు అవగాహన కల్పించారు. శిబిరంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

నర్సయ్య(ఫైల్)

రామారెడ్డి, జూన్ 20: జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డిలో గురువారం చోటుచేసుకున్నది. ఎస్సై విజయ్‌కొండ తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి చెందిన దండబోయిన నర్సయ్య(78) ఐదేండ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మూడేండ్ల క్రితం అతడి కొడుకు, కోడలు మృతిచెందారు. ఈ విషయాల్లో తీవ్ర మనస్తాపం చెందిన అతడు జీవితంపై విరక్తితో సొంత ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి రిమాండ్

లింగంపేట, జూన్ 20: మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన నీల స్వామిపై హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. స్వామి కోమట్‌పల్లి నుంచి బోనాల్ గ్రామానికి వెళ్తున్న సమయంలో జాన్కంపల్లి గ్రామానికి చెందిన నవీన్, సుధాకర్ పలుకరించి మెంగారం గ్రామ సమీపంలో మద్యం సేవించినట్లు తెలిపారు. సుధాకర్ వద్ద స్వామి అప్పు తీసుకున్నాడని అన్నారు. తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించక పోవడంతోపాటు నవీన్, స్వామి మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయన్నారు. ఇద్దరికీ స్వామితో విరోధం ఉండడంతో పథకం ప్రకారం చంపాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ముగ్గురు కలిసి మద్యం సేవించిన అనంతరం స్వామి బోనాల్‌కు వెళ్తున్న సమయంలో మెంగారం గ్రామ బస్టాండ్ వద్ద నవీన్, సుధాకర్ కలిసి అతడిపై కత్తితో దాడి చేసి గొంతు కోశారని తెలిపారు. నీల స్వామి తల్లి అల్లెవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

చోరీకి యత్నించిన నిందితుడి అరెస్టు

నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 20: ఎల్లారెడ్డిలోని అయ్యప్పస్వామి ఆలయంలో నెల రోజుల క్రితం చోరీకి యత్నించిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ గురువారం తెలిపారు. లింగంపేట మండలం ఎక్కపల్లి గ్రామానికి చెందిన మాలోత్ గణేశ్ అయ్యప్పస్వామి ఆలయం తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించాడని అన్నారు. అతడిని పట్టుకొని తాళం పగుల గొట్టేందుకు ఉపయోగించిన రాడ్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇతడిపై లింగంపేట, తాడ్వాయి, నాగిరెడ్డిపేట, దేవునిపల్లి పోలీస్‌స్టేషన్లలో పలు చోరీ కేసులు ఉన్నాయన్నారు. గతంలో జైలుకు కూడా వెళ్లి వచ్చాడని తెలిపారు. నిందితుడిని గురువారం రిమాండ్‌కు తరలించామన్నారు.

నేడు ఇంటర్ ఫస్టియర్ స్పాట్ అడ్మిషన్లు

రామారెడ్డి, జూన్ 20: సదాశివనగర్‌లోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో 15, సీఈసీలో 12 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై అవగాహన

బీబీపేట్, జూన్ 20 : మండలంలోని మాందాపూర్ గ్రామంలో రైతులకు నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై సెంట్రల్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయంలో అవలంబించాల్సిన నూతన పద్ధతులు, మెళకువల గురించి రైతులకు వివరించారు. ఏఈవో సాగర్, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ వర్ష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాలేజీని సందర్శించిన ఎంపీపీ, జడ్పీటీసీ

లెక్చరర్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ, జడ్పీటీసీ

నాగిరెడ్డిపేట, జూన్ 20: మండల కేంద్రంలోని గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కాలేజీని జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ వినీత గురువారం సందర్శించారు. కాలేజీలో వసతులు, సమస్యలను జూనియర్ లెక్చరర్ విష్ణును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు గదుల కొరత ఉన్నదని ఆయన వారి దృష్టికి తీసుకెళ్లాడు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని వారు భరోసా ఇచ్చారు. వారివెంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు దుర్గారెడ్డి తదితరులు ఉన్నారు.

నిబంధనల ప్రకారం ఫీజు తీసుకోవాలి

ఎల్లారెడ్డి, జూన్ 20: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం నిబంధనల ప్రకారం విద్యార్థుల నుంచి ఫీజులు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు అన్నారు. ఎల్లారెడ్డిలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిబంధనల ప్రకారం పాఠశాలల్లో వసతులు కల్పించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు జాషువ, వంశీ, వెంకట్, రాజశేఖర్, సాయి, చరణ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

కామారెడ్డి, జూన్ 20 : ఎక్సైజ్ పోలీసుల దాడిలో పట్టుబడిన ట్రాలీ ఆటో, మోటార్ బైక్‌లకు ఈ నెల 21న వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.5 వేలు డీడీ చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. హీరో హోండా స్ప్లెండర్ బైక్ రూ.25 వేలు, ట్రాలీ ఆటో రూ. లక్షా 25 వేల ప్రారంభ ధర నిర్ణయించినట్లు తెలిపారు.

విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేత

విద్యార్థినులకు యూనిఫామ్స్‌ను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

బాన్సువాడ టౌన్, జూన్ 20 : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని రంగాల్లో ముందుండాలని బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్‌ను మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, విద్యాకమిటీ చైర్మన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్లు దుకాణాలపై దాడులు

పరీక్ష నిమిత్తం కల్లు శాంపిల్‌ను సేకరించిన ఎక్సైజ్ శాఖ అధికారులు

రాజంపేట్, జూన్ 20: మండలంలోని పలు కల్లు దుకాణాలు, బెల్టు షాపులపై ఎక్సైజ్ శాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్తీ కల్లుతో పాటు అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. కల్లు నమూనాను పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి రవీందర్‌రాజు మాట్లాడుతూ.. జనవరి నుంచి జూన్ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో రూ.6,72,115విలువైన మద్యం, కల్తీ కల్లును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 18కేసులు నమోదు చేయడంతోపాటు ముగ్గురిని అరెస్టు చేశామని చెప్పారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగకుండా తరచూ తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్; డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

శ్రీమాన్‌ను సన్మానిస్తున్న కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిరా

విద్యార్థికి సన్మానం

కామారెడ్డి, జూన్ 20 : పట్టణానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ రాజు కుమారుడు ఆరో తరగతి చదువుతున్న శ్రీమాన్‌చారి అమెరికాలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ద్వితీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరా ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీమాన్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

షబ్బీర్‌అలీకి వినతి పత్రం అందజేస్తున్న మాచారెడ్డి మండల నాయకులు

దోమకొండ, జూన్ 20 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ ప్రభుత్వ సలహాదారులు, మాజీ మంత్రి షబ్బీర్ అలీకి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణం కోసం రూ.8 లక్షలు నిధులు మంజూరు చేయాలని షబ్బీర్‌అలీకి వినతిపత్రాన్ని అందజేసినట్లు జడ్పీటీసీ తెలిపారు.

డ్రైనేజీ నిర్మించాలని..

మాచారెడ్డి, జూన్ 20 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో ఆరు నెలల క్రితం నాలుగు వరుసల రహదారి నిర్మించారు. డ్రైనేజీ నిర్మించకపోవడంతో ఇండ్లల్లోకి వర్షపు నీరు చేరుతుందని రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి గురువారం వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రామమౌళి, అలీఖాన్, బన్సీలాల్, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.